## 125. ప్రమాదకర గుణం

మనిషి చేత రకరకాల పాపాలని చేయించే అరిషడ్వర్గాల అధిదేవతలు ఓ సారి అందుకు తాము వుపయోగించే పరికరాలని అమ్మకానికి పెట్టారు.

ద్వేషానికి వుపయోగించే ఆయుధాలు, అబద్ధంతో మాట్లాడే నాలిక, అసూయతో చూసే కళ్ళు, గర్వం పొంగిపొరలే తల, లోభాన్ని పోషించే మనసు... ఇలా. వాటన్నిటికన్నా ఓ తాళంచెవి ధర అధికంగా వుండటంతో ఒకరు ఆ అధిదేవతని అడిగారు.

"ఇది దేనికి వుపయోగిస్తారు?"

"మనిషిని నిరుత్సాహపరచడానికి."

"ఇది ఎందుకంత ఖరీదు?"

"ఎందుకంటే దీనికి మిగిలిన వాటన్నిటికన్నా విలువ అధికం కాబట్టి. దీంతో నేను ఓ మనిషి హృదయాన్ని అతనికి తెలీకుండా తెరచి, లోపలకి ప్రవేశించగలను. ఓ సారి నేను అక్కడ స్థానం సంపాదించాక నేనతన్ని నా ఇష్టం వచ్చినట్లు కృంగదీసి ఆడించగలను. ఉత్సాహం లేని మనిషి మరణించినవాడితో సమానం." దాని అధిదేవత గర్వంగా చెప్పింది.

నిరుత్సాహం, ఉదాసీనత అనేవి లౌకికంగానే కాక, ఆధ్యాత్మికంగా కూడా ప్రగతికి అడ్డుపడుతాయి.

## 126. చెప్పినా తెలియనిది

కొందరు లావో జు శిష్యులు ఆయన చెప్పిన మాటల గురించి చర్చించుకుంటున్నారు. ఆ మాటలు...

'తెలిసిన వాడు చెప్పడు.

చెప్పిన వాడికి తెలీదు.'